## క్లుప్తంగా

### నేడు చేపపిల్లలు విడుదల చేయనున్న మంత్రి నాగార్జున

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వద్ద ఉన్న కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ జలాశయంలో శనివారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగు నాగార్జున చేతుల మీదుగా చేపపిల్లలు విడుదల చేయనున్నట్లు జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఆవుల చంద్రశేఖరరెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమానికి రిజర్వాయర్‌లో చేపలు పట్టే మత్స్యకారులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

### ఆరేటి కోటమ్మకు మంత్రి మేరుగు నివాళి


కోటమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: ఆర్టీసీ మాజీ చైర్మన్ ఆరేటి కోటయ్య సతీమణి ఆరేటి కోటమ్మ మృతదేహానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున శుక్రవారం పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. కోటమ్మ ఒంగోలులో తన కుమారుడి వద్ద ఉంటూ వయోభారంతో గురువారం మృతి చెందడంతో అంత్యక్రియల నిమిత్తం శుక్రవారం స్వగ్రామమైన సంతనూతలపాడు మండలం ఎండ్లూరు తీసుకొచ్చారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, స్థానిక సర్పంచ్ ఎస్.పుల్లయ్య, ఎంపీటీసీ కే వెంకటేశ్వరరావు, దుంపా యలమందారెడ్డి, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### మహాలక్ష్మమ్మ సేవలు అభినందనీయం


మహాలక్ష్మమ్మను సత్కరిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

చీమకుర్తి: చీమకుర్తి బాలికల గురుకుల పాఠశాలలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న టీ మహాలక్ష్మమ్మ సేవలు అభినందనీయమని ఎంఈఎఫ్ నాయకులు అన్నారు. శుక్రవారం చీమకుర్తి గురుకుల పాఠశాలలో ఆమెకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆమె ప్రశంసపత్రం అందుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఎఫ్ నాయకులు బొంతా ఏసుదాస్, జే యాకోబు, ఎల్.కోటేశ్వరరావు, జీ రోశయ్య, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

### జలజీవన్ మిషన్‌కు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ యద్దనపూడి

చీమకుర్తి: మండలంలోని తొర్రగుడిపాడు గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా మంజూరైన తాగునీటి పథకానికి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. జలజీవన్ మిషన్ ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించేందుకు రూ.26 లక్షలు మంజూరు కావడంతో పైపులైన్ నిర్మాణానికి ఎంపీపీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌పై ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ విశిష్ట లక్షణాలు, లక్ష్యసాధన, పురోగతి, నిధుల కేటాయింపు గురించి ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రశ్న లేవనెత్తారు. దీనిపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయక మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ సమాధానమిచ్చారు. పిల్లలు, ప్రసూతి మరణాల తగ్గింపు, సంక్రమించే వ్యాధుల నివారణ, నియంత్రణ, సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, జనాభా స్థిరీకరణ, ఆరోగ్యకర జీవనశైలి, ఆహార పోషణ, సంరక్షణ చేయడం ఈ జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. వీటిని సాధించేందుకు ప్రభుత్వం పలు ఆరోగ్య కార్యక్రమాలు అమలుచేస్తోందని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాల్లో ఈ పథకం వల్ల దేశంలో మరణాలు, వ్యాధుల రేటు గణనీయంగా తగ్గిందన్నారు. ఏపీ రాష్ట్రానికి సంబంధించి ఈ పథకం కింద 2020–21లో రూ.1,098 కోట్లు, 2021–22లో రూ.1,199 కోట్లు, 2022–23లో రూ.1,489 కోట్ల నిధులు ఖర్చు చేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

## ఘనంగా జిల్లా అవతరణ దినోత్సవం


జిల్లా జెండా ఎగురవేస్తున్న కలెక్టర్, అధికారులు

ఒంగోలు మెట్రో: 55వ జిల్లా అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు ప్రకాశం భవనంలోని టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి కలెక్టర్ దినేష్‌కుమార్, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా జెండా ఎగురవేసి వందన సమర్పణ చేశారు. దేశభక్తి గీతాలకు విద్యార్థినులు శాస్త్రీయ నృత్యం చేశారు. ప్రకాశం పంతులు కుటుంబ సభ్యుడు, కవులు, కళాకారులను కలెక్టర్ సన్మానించారు.ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక లాయర్‌పేట రైతు బజార్ వద్ద గల మాజీ ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఒంగోలు నగర డిప్యూటీ మేయర్ వేమూరి సూర్య నారాయణ (బుజ్జి), 35వ డివిజన్ కార్పొరేటర్ గిరిజా శాండిల్య, కార్పొరేషన్ డీఈ గణపతి, ఏఈ టి.చంద్రశేఖర్, ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్య, కోశాధికారి పూర్ణచంద్రరావు, నరసింహారావు, సమితి సభ్యులు మద్దులూరి హరి, మైనంపాటి సాయి, అర్చకులు రాముశర్మ, ఫణికుమార్‌శర్మ పాల్గొన్నారు.


జిల్లా అవతరణ దినోత్సవంలో భాగంగా కలెక్టరేట్‌లో ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్


ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్


శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థిని


ప్రకాశం పంతులు కుటుంబ సభ్యుడు, కవులు, కళాకారులను సన్మానిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

## పచ్చాకు ముఠా కూలీ కుటుంబాన్ని ఆదుకోవాలి


శోభారాణి కుటుంబాన్ని పరామర్శిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

ఒంగోలు టౌన్: పచ్చాకు కూలికి వెళ్లి వస్తూ ట్రాక్టర్ తిరగబడిన ప్రమాదంలో పచ్చాకు కింద పడి ప్రాణాలు కోల్పోయిన మద్దిపాడు మండలం రాచవారిపాలెం గ్రామానికి చెందిన సుదర్శి శోభారాణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు కోరారు. శుక్రవారం స్థానిక జీజీహెచ్‌లో శోభారాణి మృతదేహాన్ని చూసి ఆమె కుటుంబాన్ని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం కంకణాల మాట్లాడుతూ ఈ ప్రమాదంలో మరో ఇద్దరు కూలీలు గాయపడ్డారని చెప్పారు. పచ్చాకు కూలీలకు వృత్తిపరంగా భద్రత కల్పించాలని, బీమా సౌకర్యం కల్పించాలని, మృతుల కుటుంబాలకు, గాయపడిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

## ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిశీలన


రోడ్డును పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ డీఈ అరుణ, ఏఈ శ్రీకాంత్

కొత్తపట్నం: కొత్తపట్నం గ్రామంలో ఆర్‌అండ్‌బీ నిధులు రూ.2.75 కోట్లతో మార్కెట్ యార్డ్ నుంచి కె.పల్లెపాలెం వరకు నిర్మాణంలో ఉన్న రోడ్డును ఆర్‌అండ్‌బీ డీఈ అరుణ కుమారి, ఏఈ శ్రీకాంత్ శుక్రవారం పరిశీలించారు. కొత్తపట్నం బస్టాండ్‌లో ఉన్న ఆక్రమణలు తొలగించడం వలన ప్రజలకు ఎంతో ఉపయోగమని, మంచి పని చేశారని అభినందించారు. రోడ్డును త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని స్థానికులు కోరారు. రోడ్డు వేయడానికి తమ వంతు సహకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ చెరుకూరి వీరరాఘవరావు, తంబి కాంతారావు, కోడూరి శ్రీను, కట్టా శేఖర్‌బాబు, మోటుపల్లి బాబు, తంబి వెంకటేశ్వర్లు, గొరవరపు శివాజీ, తంబి సురేష్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు నివారించాలి

- యువతకు ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు పిలుపు


సర్టిఫికెట్లు అందిస్తున్న ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, రవాణాశాఖ ఉప కమిషనర్ సుశీల, ఎంవీఐలు

ఒంగోలు: రహదారి ప్రమాదాల నివారణలో యువత భాగస్వాములు కావాలని ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు పిలుపునిచ్చారు. రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా స్థానిక రవాణాశాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాలలో ప్రాణాపాయంలో ఉన్న వారికే కాకుండా మహిళల ప్రసవ సమయం వంటి సందర్భాల్లో కూడా రక్తం ఆవశ్యకత ఎక్కువగా ఉంటుందన్నారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలు నిలిపేందుకు యువత తమవంతు సాయంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. యువత రక్తదానం వంటి సామాజిక బాధ్యతతో పాటు ప్రమాదాల నివారణ దిశగా కూడా దృష్టి సారించాలన్నారు. రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, సీటుబెల్టు ధరించి కార్లు వంటివి నడపాలని సూచించారు. ఇవి కేవలం వాహనం నడిపే వ్యక్తి రక్షణకు సంబంధించినవన్నారు. రోడ్డు వినియోగదారులు అనేక రకాలుగా ఉంటారని, వారంతా సురక్షితంగా ఉండాలంటే వాహన వినియోగ సమయంలో ఏకాగ్రతతో వాహనాన్ని నడపాలని చెప్పారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, ప్రమాద బీమాతో పాటు విధిగా వాహనం నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. పేస్, రైజ్, క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు 70 మందికిపైగా రక్తదానం చేయగా, వారికి ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంవీఐలు కిరణ్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షునిగా రవీంద్రనాథ్


వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులను సత్కరిస్తున్న రవీంద్రనాథ్

ఒంగోలు: వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షునిగా మద్దిపాడు మండలం బసవన్నపాలెంకు చెందిన గుంతోటి రవీంద్రనాథ్‌ను నియమించారు. శుక్రవారం ఒంగోలులో జరిగిన జగనన్న కాఫ్టెన్ అనే కార్యక్రమానికి వచ్చిన వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య నియామకపత్రం అందించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు చైతన్య పేర్కొన్నారు. తనకు పదవి రావడానికి కారకులైన చైతన్య, జిల్లా అధ్యక్షుడు రేలా అమర్‌నాథ్‌రెడ్డిలను దుశ్శాలువాతో రవీంద్రనాథ్ సత్కరించారు.

### సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రత్యేక బహుమతి

- కైవసం చేసుకున్న బేస్తవారిపేట జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థి

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థి గంగుల శివకౌశిక్ సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రత్యేక బహుమతి సాధించాడు. విజయవాడలో విశ్వేశ్వరయ్య సైన్స్ మ్యూజియం, ఇండియన్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. పలు రాష్ట్రాలకు చెందిన 210 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులు ప్రదర్శించారు. శివకౌశిక్ అతి తక్కువ ఖర్చుతో తయారుచేసిన డ్రైవర్స్ యాంటి స్లీప్ అలారం ప్రాజెక్టు ప్రత్యేక బహుమతికి ఎంపికైంది. సైన్స్ ఉపాధ్యాయురాలు ఎస్‌వీ భారతి, హెచ్‌ఎం ఎంఎస్ శర్మ ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరించారు. భారత్ ఎలక్ట్రానిక్ కంపెనీ నుంచి ప్రత్యేక బహుమతిని విద్యార్థి అందుకున్నారు. సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, ఆర్జేడీ నాగమణి, మ్యూజియం క్యూరేటర్ ఉషా మెహరా చేతులమీదుగా బహుమతి, ప్రశంసపత్రాన్ని అందుకున్నారు.

### గుంటూరు వెళ్లి పింఛన్ అందజేసిన వలంటీర్


లక్ష్మీనారాయణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

నాగులుప్పలపాడు: అనారోగ్యానికి గురై గుంటూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన పింఛన్ దారుడు పాట్లూరి లక్ష్మీనారాయణకు స్థానిక వలంటీర్ పొన్నం నాగమల్లేశ్వరి వెళ్లి పింఛన్ అందించారు. తన సొంత ఖర్చులతో గుంటూరు వెళ్లి పింఛన్ అందించడంతో లక్ష్మీనారాయణ కుటుంబం సంతోషం వ్యక్తం చేసి అభినందించారు.

### అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలి

ఒంగోలు: అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సంఘటన కార్యదర్శి సీహెచ్ శ్రావణకుమార్ కోరారు. శుక్రవారం ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒంగోలులోని స్థానిక కార్యాలయంలో ఆపస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగరేసి వేడుకలు నిర్వహించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గ సమావేశంలో అప్రెంటీస్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకోవడాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం వ్యతిరేకిస్తోందని అన్నారు. జిల్లా అధ్యక్షుడు కె.మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి టి.దిలీప్ చక్రవర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్ హిమజ, కోశాధికారి బి.గుణప్రసాద్, జిల్లా బాధ్యులు వి.చంద్రశేఖర్, ఎం.ఎస్.కె.శర్మ, శేషారావు, ఏ వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య, సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో రాజ్యలక్ష్మి అమ్మవారి ప్రాకారోత్సవం


అమ్మవారి ప్రాకారోత్సవంలో పాలకవర్గం, భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలో వేంచేసి యున్న ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి ఆలయ ప్రాకారోత్సవాన్ని శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వాహణ అధికారి డి.రజనీకుమారి, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, ఈమని మదన్‌మోహన్, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

### బీజేపీ మహిళా మోర్చా నూతన కార్యవర్గం ఎంపిక


బీజేపీ మహిళా మోర్చా నూతన కార్యవర్గంతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి

ఒంగోలు సెంట్రల్: బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యవర్గాన్ని పునఃవ్యవస్థీకరించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి తెలిపారు. ఒంగోలులోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మలినేని గీతాంజలి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. శివారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యులకు దిశానిర్దేశం చేశారు. మహిళా మోర్చా నూతన అధ్యక్షురాలిగా మలినేని గీతాంజలి, ఉపాధ్యక్షులుగా మద్దినేని లక్ష్మీదేవి, గుర్రం కుమారి, బొరుసు లలిత, షేక్ ముతార సుల్తానా, ప్రధాన కార్యదర్శులుగా పెల్లెటి శివకుమారి, విజయరావు, కార్యదర్శులుగా శ్రీలక్ష్మి, ప్రసన్నజ్యోతి, షేక్ ఆదాం, బి.ధనిశెట్టి పావని, డి.అజంతా, జిల్లా కార్యవర్గసభ్యులుగా లింగంగుంట వనజను నియమించారు. జిల్లా మహిళా మోర్చా ఇన్‌చార్జి తీగల సత్యవతి, శాసనాల సరోజిని, జిల్లా ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, శివాజీయాదవ్, మీడియా ఇన్‌చార్జి ధనిశెట్టి రాము, నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు, నిధులపై అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హాఫీజ్‌బాషా

ఒంగోలు: ప్రభుత్వ పథకాలు, నిధులపై స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ ఇంక్యుబేటర్ సీఈవో డాక్టర్ హాఫీజ్ బాషా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు స్టార్టప్‌లు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వాల నుంచి ఉన్న పథకాలు, వాటికి అవసరమైన నిధులు సమకూర్చుకోవడం, సమర్థవంతంగా వాటిని వినియోగించడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, ఏవో ఎం.రమణబాబు, ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ రూప అక్కేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఆశయాలతో సాగే నేతలకే మద్దతు

- దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు వెంగళరావు


మాట్లాడుతున్న దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు

ఒంగోలు: అంబేడ్కర్ ఆలోచనలు, ఆశయాలతో ముందుకు సాగే నేతలకే 2024 సార్వత్రిక ఎన్నికల్లో దళిత బహుజనుల మద్దతు ఉంటుందని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు అన్నారు. అందులో భాగంగానే ఈ నెల 26వ తేదీ అంబేడ్కర్ వాదుల మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం స్థానికంగా అంబేడ్కర్ వాదుల మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ మహాసభను స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ముఖ్యనాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు మాచవరపు జూలియన్, నీలం నాగేంద్రరావు, దాసరి శివాజీ, దారా అంజయ్య, మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగుల చైతన్య, బీసీ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాటికలపూడి జయరాం, మాలభేరి జాతీయ యువజన సంఘ అధ్యక్షుడు చప్పిడి ప్రియతం, మాలభేరి జిల్లా అధ్యక్షుడు మేదికొండ విద్యాసాగర్, గిరిజన నాయకులు తలపుల శ్రీనివాసరావు, దళిత సంఘాల నాయకులు కందుల శ్రీనివాసరావు, తేళ్ల దిలీప్‌కుమార్, చిట్టిమాల సంపత్‌కుమార్, దుగ్గిరాల విజయ్‌కుమార్, కాకుమాను రవి, దిలీప్, ఎరిచర్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి వెండి విగ్రహం అందజేత


అయ్యప్పస్వామి వెండి విగ్రహం


స్వామివారికి మూలమంత్ర హోమ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలు మెట్రో: స్థానిక గాంధీరోడ్డు నివాసి చీదెళ్ల ఉమామహేశ్వరరావు, అతని పిల్లలు చీదెళ్ల భాను ప్రకాష్, చీదెళ్ల యశ్వంత్ కుమార్‌లు శుక్రవారం స్థానిక మంగమూరురోడ్డులోని ఐశ్వర్యనగర్లో వెలసిన హరిహరసుత అయ్యప్ప క్షేత్రానికి నాలుగు కేజీల బరువు గల నాలుగు లక్షల రూపాయల విలువైన వెండి అయ్యప్పస్వామి కౌతుకమూర్తి (అర్చామూర్తి)ని దేవస్థానం ప్రధాన అర్చకులు పరాంకుశం కేశవాచార్యులుకు అందజేశారు. అందులో భాగంగా ఉదయం పది గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, స్వామివారి మూల మంత్ర హోమం, నూతన విగ్రహ సంప్రోక్షణ, పంచగవ్యాలు పంచామృతాలతో అభిషేకంను నారాయణ రమణ దీక్షితులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం కేశవాచార్యులు, అర్చకులు చక్రవర్తి, రంగస్వామి, సమీర్ ఘనంగా నిర్వహించారు.